సాక్షి
రంగారెడ్డి

బుధవారం । 28 । మే । 2025



నాలాపై కన్నేసి..

దాతర్‌చెరువు కాల్వపై కన్నేసిన అక్రమార్కులు మట్టితో నింపి కబ్జా చేశారు. అర కిలోమీటర్ మేర నాలాను ఆక్రమించారు.

8లో▸



గడువులోగా అందించాలి

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గడువులోగా యూనిఫాం అందించాలని డీఆర్‌డీఏ ఏపీడీ సూర్యారావు అన్నారు.

8లో▸



ఏప్రిల్‌లోగా..

సుంకిశాల ఇంటేక్ వెల్ పనులను ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు.

8లో▸

న్యూస్‌రీల్

గురుకుల విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో గురుకుల పూర్వ విద్యార్థులకు వృతి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2017 నుంచి కమ్మదనం గురుకుల బాలికల కళాశాలలో విద్యనభ్యసించి ఇప్పటి వరకు ఉద్యోగం లేని విద్యార్థినులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. శిక్షణ ఇచ్చేందుకు ఉన్నతి ఫౌండేషన్ ముందుకు వచ్చినట్టు తెలిపారు. 19–25 ఏళ్ల మధ్య వయసు కలిగిన గురుకుల పూర్వ విద్యార్థులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు వెంటనే కమ్మదనం గురుకుల కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఒబెదుల్లా కొత్వాల్

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీఎస్‌ఎంఎఫ్‌సీ) చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్ అన్నారు. మైనార్టీ మహిళా శక్తి పథకంలో భాగంగా పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం 258 మంది మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒబెదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మైనార్టీలకు అండగా నిలుస్తోందని తెలిపారు. పేద మహిళలను ప్రోత్సహించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తోందని, మహిళలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘు నాయక్, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జమృద్‌ఖాన్, సర్వర్‌పాషా, ఇబ్రహీం, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

మైసిగండి మైసమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవత ఆలయ హుండీ ఆదాయాన్ని జిల్లా దేవాదాయ శాఖ తూర్పు విభాగ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. మొత్తం 60 రోజులకు గాను రూ.11,77,715 ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని కడ్తాల్ కెనరాబ్యాంక్‌లో డిపాజిట్ చేయనున్నట్లు ఈవో స్నేహలత తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ శిరోలీ, అన్నపూర్ణ సేవా ట్రస్ట్ సభ్యులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సాగులో సేంద్రియ పద్ధతులు మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మొయినాబాద్: రైతులు పంటల సాగులో సేంద్రియ పద్ధతులు అవలంబించి అధిక లాభాలు పొందొచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని చిన్నషాపూర్‌లో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగు పద్ధతులు, భూసారం పెంపు, నీటి వనరులు, పర్యావరణ పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. తద్వారా భూమిలో భూసారం పెరిగి నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కూరగాయ పంటలకు డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్, మల్చింగ్ పేపర్ వాడుకోవడం ద్వారా నీటి వృథాను తగ్గించి కలుపు నివారించుకోవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణకోసం మొక్కలు పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం నోడల్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, శాస్త్రవేత్తలు నీలిమ, రేవతి, మండల వ్యవసాయాధికారి అనురాధ, ఏఈఓ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె మెరిసేలా..

షాద్‌నగర్: పల్లెల్లో స్వచ్ఛదనం, పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తతం చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. పంచాయతీల్లో పారిశుద్ధ్య సమస్యలు పెరిగిపోవడం, సరిపడా కార్మికులు లేక పూర్తి స్థాయిలో పరిష్కారం కావడం లేదని గుర్తించింది. ఈ మేరకు పారిశుద్ధ్య జోన్లు ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఇంటింటా చెత్త సేకరణ.. తడి, పొడి వ్యర్థాల నిర్వహణ.. మురుగు కాల్వలు, అంతర్గత రహదారుల పరిశుభ్రత వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకుంటోంది.

పచ్చదనం పెంపొందేలా..

- ప్రభుత్వం స్వచ్ఛ ప్రణాళిక
- పంచాయతీల్లో పారిశుద్ధ్య జోన్లు
- చెత్త సమస్యకు సత్వర పరిష్కారం
- పల్లె ప్రగతి యాప్‌లో ఎప్పటికప్పుడు ఫొటోల అప్‌లోడ్



జోన్‌ల విభజన ఇలా..

జిల్లాలోని 19 మండలాల్లో 531 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు అందుబాటులో లేరు. ప్రతి గ్రామంలోని ఇళ్లు, గ్రామ విస్తీర్ణం, కార్మికుల సంఖ్యకు అనుగుణంగా జోన్లుగా విభజిస్తున్నారు. పెద్ద పంచాయతీలైతే గరిష్ఠంగా నాలుగు, చిన్న పంచాయతీలైతే రెండు జోన్ల చొప్పున ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జోన్లను సూచిస్తూ పారిశుద్ధ్య మ్యాపును ఏర్పాటు చేస్తారు. జోన్‌ల పరిధిలో ఉండే ఇళ్లు, మురుగు కాల్వలు, సీసీ రోడ్ల పొడవు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాలను మ్యాపులో పొందుపరుస్తారు.

ఫొటోలు తీసి.. అప్‌లోడ్

షెడ్యూల్ ప్రకారం ఒక జోన్ పరిధిలో కార్మికులతో పారిశుద్ధ్య పనులు పూర్తి చేయించి, సమస్యను పరిష్కరిస్తారు. మరుసటి రోజు మరో జోన్‌లో ప్రారంభిస్తారు. ఇలా జోన్‌ల ప్రకారం నాలుగు రోజులకు తగ్గకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. రోజువారీ పారిశుద్ధ్య నివేదిక (డీఎస్ఆర్)లో జోన్లలో చేస్తున్న పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. దీంతో ఏ జోన్‌లో పనులు ఏమేరకు జరిగాయో సులభంగా తెలుసుకోవచ్చు.

ఎరువుల తయారీ

పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేయనున్నారు. తడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేయనున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో కంపోస్టు షెడ్లు ఖాళీగా ఉన్నాయి. వాటిలో తడి చెత్త వేయడం ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసి నర్సరీల్లోని మొక్కలకు వేయడం లేదా విక్రయించడం చేస్తారు.

ఆదాయం పెంపునకు చర్యలు

పొడి చెత్త నుంచి సేకరించిన ప్లాస్టిక్, గాజు ఇతర వస్తువులను తుక్కు దుకాణాలకు పంపించి ఆదాయం పొందనున్నారు. దీని ద్వారా వచ్చిన మొత్తాన్ని గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్‌కు జమ చేయనున్నారు. ఇందు కోసం ప్రత్యేక రిజిస్టర్‌ను నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియను ఎంపీఓ, డీఎల్‌పీఓ, డీపీఓ, స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయనున్నారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని పల్లె ప్రగతి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

పల్లెలు పరిశుభ్రం



గ్రామ పంచాయతీల్లో జోన్లు ఏర్పాటు చేస్తున్నాం. దీని ద్వారా పారిశుద్ధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించవచ్చు. పల్లెలు పరిశుభ్రంగా ఉంటాయి.

– బన్సీలాల్, ఎంపీడీఓ, ఫరూఖ్‌నగర్

జనాభా ఆధారంగా..

పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. పంచాయతీల్లో జనాభా ఆధారంగా జోన్లు ఏర్పాటు చేస్తున్నాం. దీంతో పారిశుద్ధ్య పనితీరు మరింత మెరుగుపడుతుంది.

– సురేష్ మోహన్, జిల్లా పంచాయతీ అధికారి



తిరంగా ర్యాలీలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

సైనికుల త్యాగాలు మరువలేనివి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కందుకూరు: జాతీయవాదాన్ని గుండెల నిండా నింపుకొని పోరాడుతున్న మన సైనికుల త్యాగాలు మరువలేనివని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్.అంజిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. యుద్ధంలో గెలవడమే కాదు ప్రత్యర్థులను సైతం తన వైపు తిప్పుకొన్న గొప్ప నేత ప్రధాని మోదీ అని కొనియాడారు. భారత్ ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక శక్తిగా ఎదగడానికి మోదీ పాలనతోనే సాధ్యమైందన్నారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కడారి జంగయ్య మాట్లాడుతూ.. ఓటు రాజకీయాలను పక్కన పెట్టి దేశం కోసం అంతా ఏకమై సైనికుల్లో ఆత్మస్థైర్యం నింపుదామన్నారు. నియోజకవర్గంలో 20 వేలకు పైగా రోహింగ్యాలు ఉన్నారని, వారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు బస్వ పాపయ్యగౌడ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, పి.కృష్ణగౌడ్, జిట్టా రాజేందర్ రెడ్డి, ఎస్.మల్లారెడ్డి, కె.జంగారెడ్డి, మాజీ ఎంపీపీ అశోక్‌గౌడ్, టి.జగదీశ్వర్‌రెడ్డి, ఎ.సత్తయ్య, బి.మల్లేష్, బి.సత్యనారాయణరెడ్డి, ఎస్.నర్సింహారెడ్డి, ఊటు మహేందర్, ఎ.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లకోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ నాగార్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థులకు ఎంపీసీ, ఎంజెడ్సీ, బీజెడ్సీ, ఎంపీసీఎస్, బీఏ, బీకాం, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీలో అడ్మిషన్ పొందేందుకు నేరుగా గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసి డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 63050 51490, 98850 03390, 97034 41345 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



నిరసన చేపట్టిన వివిధ సంఘాల నాయకులు

ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే

పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తిరుమలయ్య

షాద్‌నగర్‌రూరల్: ప్రస్తుతం దేశంలో మావోయిస్టులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తిరుమలయ్య ఆరోపించారు. మావోయిస్టులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్‌లను నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని ముఖ్యకూడలిలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, ఆదివాసులను అత్యంత పాశవికంగా హతమార్చడం దారుణమని అన్నారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను వారి బంధువులకు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహాలను పోలీసులే కాల్చివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలు జీవించే హక్కులను కూడా హరిస్తోందని మండిపడ్డారు. మావోయిస్టులు, ఆదివాసులపై హత్యాకాండను వెంటనే విరమించుకోవాలని, లేదంటే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసి, గిరిజన కాంగ్రెస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు, బీఆర్ఎస్ నాయకుడు రాజావరప్రసాద్, బీఎస్పీ నాయకుడు దొడ్డి శ్రీనివాస్, సీపీఎం నాయకుడు ఈశ్వర్‌నాయక్, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎప్పటికో పరిష్కార ‘మార్గం’!

- సాగర్‌రోడ్డుపై వాహనాల రద్దీ
- తరచూ ప్రమాదాలు
- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- విస్తరణకు నోచుకోని రహదారి



నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారి

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారి మృత్యుమార్గంగా మారింది. ఎప్పుడు ఏచోట ప్రమాదం జరుగుతుందో.. ఎవరి ప్రాణాలు గాలిలో కలుస్తాయో తెలియడం లేదు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు తరచూ రాకపోకలు సాగించడం, స్థానికులు వస్తూ పోతుండడంతో ఈ రోడ్డు రద్దీగా మారింది. మహానగరం నుంచి ఉద్యోగ, వ్యాపారరీత్యా నిత్యం యాచారం, మాడ్గుల్, కడ్తాల్, ఆమన్‌గల్లు మండలాల ప్రజలే కాకుండా నల్లగొండ జిల్లా దేవరకొండ, మర్రిగూడ, పల్లెపల్లి, చింతపల్లి, మిర్యాలగూడ తదితర మండలాల నుంచి వేలాది మంది ప్రయాణికులు కార్లు, బైక్‌లు, ఇతర వాహనాలపై రాకపోకలు సాగిస్తారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ బస్సులు రవాణా సాగిస్తుంటాయి. సాగర్‌రోడ్డు సమీపంలోని యాచారం, కడ్తాల్, ఆమన్‌గల్లు, కందుకూరు, ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల్లోని కొన్ని గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో కలపడంతో ఈ రోడ్డుపై వీఐపీల రాకపోకలు అధికమయ్యాయి.


ప్రతిపాదనలు సిద్ధం చేసినా..

సాగర్‌రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించడానికి గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో రోడ్డు భవనాల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు నెలల క్రితం హెచ్ఎండీఏ, రోడ్డు భవనాలు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని అధికారుల బృందం విస్తరణపై ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాదారుల అభిప్రాయాలు సైతం సేకరించింది. 99 శాతం మందికి పైగా నాలుగు లేన్లుగా విస్తరించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం సమీపంలోని ఖానాపూర్ గేట్ నుంచి మాల్ సమీపంలోని తమ్మలోనిగూడ గేట్ వరకు 23 కిలోమీటర్ల మేర నాలుగు లేన్లుగా విస్తరించడానికి నిర్ణయించారు. ప్రస్తుతం పది మీటర్ల వెడల్పు ఉన్న రోడ్డును 17 మీటర్లకు విస్తరించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మధ్యలో డివైడర్, పాదచారుల ప్రయాణ సౌకర్యార్థం విస్తరణ చేపట్టాలని రోడ్డు భవనాల శాఖ నిర్ణయించింది. తర్వాత సర్కార్ దృష్టి సారించకపోవడంతో విస్తరణకు గ్రహణం పట్టింది.

ఆరునెలల వ్యవధిలోనే..

ఆరు నెలల వ్యవధిలోనే ఖానాపూర్ గేట్ నుంచి మాల్ గ్రామాల మధ్య జరిగిన ప్రమాదాల్లో పది మందికిపైగా ప్రయాణికులు మృత్యువాత పడ్డారు. 25 మందికి పైగా తీవ్ర గాయాలతో క్షతగాత్రులుగా మిగిలారు. తాజాగా యాచారంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు, చింతపట్ల గేట్ వద్ద ఓ వ్యక్తి మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అత్యధికంగా గునుగల్ గేట్ సమీపంలోని ఓ డెయిరీ, ఆగాపల్లి స్టోన్ క్రషర్, యాచారంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో, గునుగల్ అటవీ ప్రాంతం, యాచారం పోలీస్ స్టేషన్ సమీపంలో, చింతపట్ల, తమ్మలోనిగూడ, తక్కళ్లపల్లి గేట్ల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారి విస్తరణ చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


నిధులు మంజూరు కాగానే..



నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించడానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరు చేసిన వెంటనే పనులు మొదలుపెడుతాం.

– రవీందర్‌గౌడ్, రోడ్డు భవనాల శాఖ డీఈఈ, ఇబ్రహీంపట్నం డివిజన్

అవగాహన కల్పిస్తున్నాం



ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం పీఎస్‌ల పరిధిలో తరచూ వాహనాల తనిఖీలు చేపట్టి నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. అతి వేగం ప్రమాదకరమని సూచిస్తున్నాం. జరిమానాలు సైతం విధిస్తున్నాం. రోడ్డు విస్తరణ జరిగితే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుంది.

– కేపీవీ రాజు, ఏసీపీ, ఇబ్రహీంపట్నం

మూసీ.. ముందుకెళ్లదే!

- నది పునరుజ్జీవంపై నీలినీడలు
- ఆక్రమణల తొలగింపు, భూ సేకరణ, నిధుల రూపంలో సవాళ్లు
- నిర్మాణాల తొలగింపులపై ప్రజల నుంచి వ్యతిరేకత
- నది చుట్టూ భూములపై స్పష్టత వస్తేనే డీపీఆర్ తయారీ

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మూసీ పునరుజ్జీవంపై నీలినీడలు కమ్ముకున్నాయి. నది గర్భంలో ఆక్రమణల తొలగింపు, స్థల సమీకరణ, నిధుల సేకరణ రూపంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. నిర్మాణాల తొలగింపు చేయాలంటే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో ప్రస్తుత పరిస్థితుల్లో లేనిపోని చిక్కులు కొనితెచ్చుకోవడం ఎందుకని సర్కారు భావిస్తోంది. మూసీ పరీవాహక ప్రాంతాలోని ఆక్రమణలు తొలగించి, స్థల సమీకరణ పూర్తయితేనే సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక సిద్ధమవుతుందని ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన సింగపూర్ కంపెనీ మెయిన్‌హార్డ్ ఇప్పటికే తేల్చి చెప్పింది. మరోవైపు మూసీ పునరుజ్జీవానికి అవసరమైన నిధుల కోసం డీపీఆర్‌లు సాంకేతికంగా అనుమతి పొందితేనే ప్రపంచ బ్యాంక్ నుంచి రుణం విడుదలకు అంగీకరిస్తామని కేంద్రం మెలిక పెట్టింది. మొత్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్ట్ మూసీ మురికి వదలడం కలగానే మిగిలిపోనుంది.

వ్యతిరేకతతో వెనకడుగు..

కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్నట్టుగా మారింది మూసీ రిఫర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్డీసీఎల్) యంత్రాంగం పరిస్థితి. మూసీ ఆక్రమణలు, స్థల సమీకరణపై స్పష్టత ఇస్తేనే ప్రాజెక్ట్‌పై ముందడుగు పడుతుందని కన్సల్టెన్సీ సంస్థ తేల్చి చెప్పడంతో ఈ విషయంపై ఎలా ముందుకెళ్లాలో తెలియక దిక్కు తోచని స్థితిలో పడింది. ముందుగా మూసీ పరీవాహక ప్రాంతంలోని నివాసాలు, షెడ్లు, గోదాముల వంటి అక్రమ నిర్మాణాలను తొలగిస్తే తప్ప నది చుట్టూ ఎంత భూములు ఉన్నాయో ప్రభుత్వానికి స్పష్టత వస్తుంది. ఆక్రమణలను కూల్చివేస్తే రాజకీయ ప్రకంపనలు ఏర్పడటం ఖాయం. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో పాటు ప్రతిపక్షాలు కూడా దీన్నే అస్త్రంగా మలుచుకునే అవకాశాలు ఉన్నాయి. దీంతో ప్రస్తుత తరుణంలో మూసీ ఆక్రమణల జోలికి వెళ్లకపోవడమే మంచిదనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది.

భూ సేకరణ అయితేనే డీపీఆర్

మూసీకి ఇరువైపులా ఎక్కడెక్కడ ఎంత భూములు అందుబాటులో ఉన్నాయో తేలితే ఎక్కడ ఏ తరహా అభివృద్ధి చేపట్టొచ్చో స్పష్టత వస్తుంది. స్థల సమీకరణ పూర్తి కాకుండా మూసీ చుట్టూ వాణిజ్య ప్రాంతాల అభివృద్ధిని నిర్ణయించడం కష్టం. దీంతో మూసీ సుందరీకరణ కష్టమని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) యంత్రాంగం భావిస్తోంది. ఇప్పటికే పలుమార్లు స్వయంగా ముఖ్యమంత్రే కన్సల్టెన్సీ సంస్థతో చర్చలు జరిపినా.. డీపీఆర్ సిద్ధం కాకపోవడం కొసమెరుపు. ఇప్పటివరకూ మూసీ సుందరీకరణ వైపు ఒక్క అడుగు కూడా పడకపోవడంతో 2030 డిసెంబర్ నాటికి ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలన్న సీఎం లక్ష్యం చేరడం కష్టమే.

ఫీవర్‌లో కోవిడ్ అనుమానిత కేసు ?

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో మంగళవారం ఓ కోవిడ్ అనుమానిత కేసు నమోదైంది. హిమాయత్‌నగర్‌కు చెందిన వ్యక్తి(50) ఇటీవల తీర్థ యాత్రలకు వెళ్లి వచ్చాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురైన అతను స్థానిక వైద్యుడి సూచన మేరకు కోవిడ్ పరీక్షలు చేయించుకోగా పాజిటివ్ వచ్చింది. దీంతో అతను మంగళవారం మధ్యాహ్నం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి వచ్చాడు. అతడి రిపోర్టులను పరిశీలించిన ఆస్పత్రి డీఎంవో కోవిడ్‌గా అనుమానిస్తూ మందులు రాసి ఇచ్చాడు. కోవిడ్ లక్షణాలు ఉండడంతో మరోసారి ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇన్ పేషంట్‌గా చేరితే వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తామని తెలిపారు. అందుకు అతను తిరస్కరిస్తూ ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉంటానని చెప్పడంతో అతడి కుటుంబ సభ్యులందరూ కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.

సినిమా రంగంలోకి కొత్తతరం రావాలి



కలివి వనం సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

చేవెళ్ల: సినిమా రంగంలోకి కొత్త తరం రావాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు. నగరంలోని ఆయన నివాసంలో మంగళవారం చేవెళ్ల ప్రాంతానికి చెందిన నిర్మాతలు మల్లికార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి కలిశారు. ఏఆర్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ‘కలివి వనం’ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను డైరెక్టర్ రాజ్ నరేంద్రతో కలిసి కేటీఆర్ చేతుల మీదుగా విడుదల చేయించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ.. పూర్తిగా పల్లెటూరు నేపథ్యంలో.. అచ్చమైన తెలంగాణ సినిమాగా.. కలివి వనం చిత్రాన్ని ఒక మంచి సందేశంతో తెరకెక్కిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ మట్టి వాసన నేపథ్యంలో వచ్చిన చిత్రాల మాదిరిగానే తమ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడు పట్నం అవినాష్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

గడువులోగా యూనిఫాం అందించాలి


పనులను పరిశీలిస్తున్న అధికారులు

కేశంపేట: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గడువులోగా యూనిఫాం అందించాలని డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యారావు అన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళ సమాఖ్య భవనంలో మంగళవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు షర్టుల కోసం వచ్చిన క్లాత్‌ను కట్టింగ్ చేస్తున్న విధానాన్ని, మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో కుడుతున్న టైలరింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల ప్రారంభంలోగా అందుబాటులో ఉంచే విధంగా కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా టైలరింగ్ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈపీఎం బాలరాజ్, ఏపీఎం భగవంతు, సీసీలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న సైదులు

మొయినాబాద్ రూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు అన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్న అనేక మంది జర్నలిస్టులు పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వీరి అభ్యున్నతి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ముందుకెళ్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చేగూరి రాజు, సీనియర్ పాత్రికేయులు శ్రీనివాస్ చారి, గణేశ్, సుదర్శన్, బుచ్చన్న, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


మనిని(ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన గంగారాం కుటుంబం నాలుగు నెలల క్రితం జీవనోపాధి నిమిత్తం తుక్కుగూడకు వలస వచ్చారు. ఈ నెల 20వ తేదీన గంగారాం, అతని భార్య పద్మ పనికి వెళ్లగా కుమార్తె మనిని (19) ఇంట్లోనే ఉంది. సాయంత్రం వచ్చి చూడగా కుమార్తె కనిపించలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం స్థానికంగా గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయమై పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

చోరీ కేసు విచారణ

తుర్కయంజాల్: ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధి రాగన్నగూడ వెస్ట్ సూరజ్ నగర్ కాలనీలో ఈ నెల 22న ఓ ఇంటి తాళం తెరిచి దొంగతనానికి ప్రయత్నించిన కేసును విచారణ చేపడుతున్నట్లు సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఇంటి యజయాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టగా, దొంగతనానికి ప్రయత్నించిన వారి వివరాలు దొరకడం లేదని పేర్కొన్నారు. సీసీ కెమెరాల్లో నమోదైన వీడియోల ప్రకారం కాలనీలో తిరుగుతూ అనుమానాస్పదంగా కనిపించిన యువకులకు ఈ సంఘటనకు సంబంధం లేదని తేలినట్లు చెప్పారు. వారు సొంత పనిపై కాలనీలో తిరిగినట్లు గుర్తించామని తెలిపారు. మరిన్ని సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను పట్టుకుంటామని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నాలాపై కన్నేసి.. మట్టితో పూడ్చేసి!

- రాత్రికి రాత్రే దాతర్‌చెరువు కాల్వ ఆక్రమణ
- రెండున్నర ఎకరాల భూమికి ఎసరు
- పూర్తిస్థాయి విచారణకు ఇరిగేషన్ డీఈఈ ఆదేశం


దాతర్‌చెరువు కాల్వను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ హరిత తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: దాతర్‌చెరువు కాల్వపై కన్నేసిన అక్రమార్కులు మట్టితో నింపి కబ్జా చేశారు. అర కిలోమీటర్ మేర నాలాను ఆక్రమించి రెండున్నర ఎకరాల భూమిని కొల్లగొట్టారు. ప్రస్తుత మార్కెట్లో దీని విలువ రూ.కోట్లలో ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదిబట్ల మున్సిపల్ పరిధి కొంగరకలాన్‌లోని దాతర్ చెరువు నిండితే.. అలుగు పారి పులందరి వాగులోకి చేరుతుంది. దాతర్ చెరువును ఆనుకుని ఇటీవల ఓ రియల్ ఎస్టేట్ సంస్థ వెంచర్ వేసింది. ప్రస్తుతం దీని పక్కనే ఉన్న భూములను కొనుగోలు చేస్తోంది. దాతర్ చెరువు నాలా రెండు కిలోమీటర్ల మేర ఉంటుంది. భారీ ప్రవాహం ఉండే చారిత్రక ఆనవాళ్లు కలిగిన నాలాను కొంతమంది రాత్రికి రాత్రే చెరబట్టారు. వేలాది ట్రిప్పుల మట్టి నింపి దాదాపు 500 మీటర్ల పొడవునా కాల్వను కనుమరుగు చేశారు. చెరువు కట్టను సైతం చీల్చి దాదాపు రెండున్నర ఎకరాల భూమిని కబ్జా చేశారు. మార్కెట్లో దీని విలువ రూ.10 కోట్లు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. వందల ఏళ్ల నాటి కాల్వను పూడ్చేసిన అక్రమార్కులు ప్రత్యామ్నాయంగా కొత్త కాల్వ తవ్విస్తున్నారు. దీనికి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి ఎలాంటి అనుమతి లేదు.

ఫిర్యాదుతో విచారణ

కబ్జా విషయమై కొంగరకలాన్‌కు చెందిన నీళ్ల హరిబాబు అనే వ్యక్తి ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఏఈ హరిత క్షేత్ర సందర్శనకు వచ్చారు. గ్రామ నక్షా, కాలువ విస్తీర్ణం తదితర అంశాలను పరిశీలించారు. విచారణ అనంతరం నివేదిక రూపొందించి, ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

కబ్జా నిజమని తేలితే..



నాలా ఆక్రమణ విషయమై మాకు ఫిర్యాదు అందింది. అధికారులు, సిబ్బందిని ఫీల్డ్ విజిట్‌కు పంపించాం. పూర్తి స్థాయి విచారణ, సర్వేకు ఆదేశించాం. కాల్వను పూడ్చారని, కబ్జా వాస్తవమేనని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– చెన్నకేశవరెడ్డి, ఇరిగేషన్ డీఈఈ

రూ.50 లక్షలు ఇవ్వకుంటే చంపేస్తాం

- మావోయిస్టుల పేరుతో కూన రవీందర్‌గౌడ్‌కు లేఖ
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

జీడిమెట్ల/కుత్బుల్లాపూర్: రూ. 50 లక్షలు ఇవ్వాలని లేని పక్షంలో మాజీ ఎన్‌ఎస్‌యూఐ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) అధ్యక్షుడు కూన రాఘవేందర్‌గౌడ్‌ను చంపేస్తామని బెదిరిస్తూ మావోయిస్టుల పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు అతని తండ్రి కూన రవీందర్‌గౌడ్‌కు లేఖ రాసి కారుపై పెట్టి వెళ్లిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. షాపూర్‌నగర్‌కు చెందిన వ్యాపారవేత్త కూన రవీందర్‌గౌడ్ కుమారుడు రాఘవేంద్రగౌడ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈనెల 21న రాత్రి మంకీ క్యాప్, టీషర్ట్ ధరించిన వ్యక్తి అతడి ఇంటి మొదటి అంతస్తుకు వెళ్లాడు. ఆ తర్వాత కిందికి దిగి కారుపై ఎర్రటి వస్త్రంలో ఓ కవర్ పెట్టి అనంతరం ఇంటి ముందు ఉన్న తులసి మొక్కను తొలగించి వెళ్లిపోయాడు. 22న ఉదయం రవీందర్‌గౌడ్ తులసి మొక్క తొలగించి ఉండటాన్ని గుర్తించి పనివాళ్లతో మొక్కను అదే తొట్టిలో నాటించాడు. కొద్దిసేపటి తర్వాత కారుపై ఉన్న కవర్‌ను తెరిచి చూడగా నక్సలైట్ శంకరన్న గ్యాంగ్ పేరుతో రాసిన లేఖను గుర్తించాడు. షాపూర్‌నగర్‌లో ఉన్న రెండు ఇళ్లను పేల్చివేస్తామని.. నీకొడుకు రాఘవేంద్రను చంపేస్తామని..శుక్రవారం లోగా రూ.50లక్షలు సిద్ధంగా ఉంచుకోవాలని అందులో పేర్కొన్నారు. ఈ విషయమై కూన రాఘవేంద్ర గౌడ్ ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

మూసాపేట: గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లాకు చెందిన విక్రాంత్ రెడ్డి కూకట్‌పల్లిలోని హాస్టల్‌లో ఉంటూ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. భూపాలపల్లి జిల్లాకు చెందిన దీక్షిత్, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన అభినయ్, మంచిర్యాలకు చెందిన అన్షు అతడి స్నేహితులు. గంజాయికి అలవాటు పడిన వీరు గంజాయిని కొనుగోలు చేసి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల వారికి పరిచయమైన అనురాగ్, వినయ్ కూడా వారితో జత కలిశారు. దీంతో వారు 10 కేజీల గంజాయిని కొనుగోలు చేసి తీసుకువచ్చారు. కూకట్‌పల్లిలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వెనుక టీస్టాల్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడి చేసిన పోలీసులు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుల్లో ఒకరైన అభినయ్ 2024లో బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడని, మిగిలిన ముగ్గురూ ఖాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న అనురాగ్, వినయ్ కోసం గాలిస్తున్నామన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూఎస్ వీసా ఇప్పిస్తానంటూ మోసం

నిందితుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: యూఎస్ వీసా పేరుతో డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..గచ్చిబౌలికి చెందిన కాసా ప్రణయ్‌యాదవ్ అమెరికాలోని రుట్‌గర్స్ యూనివర్సిటీలో ఎంఎస్ చేసేందుకు బషీర్ అహ్మద్ అనే వ్యక్తిని సంప్రదించాడు. యూఎస్ వీసా కోసం సర్వీసు చార్జీల కింద రూ.50 వేలు ఖర్చవుతుందని చెప్పడంతో అడ్వాన్స్‌గా రూ.20 వేలు చెల్లించాడు. వీసా అప్రూవల్ కోసం ఎంబసీ ఆఫీసర్ ఒకే ఒక్క ప్రశ్న వేస్తాడని, దాంతో వీసా అప్రూవల్ అవుతుందని బషీర్ అహ్మద్ చెప్పాడు. అయితే ప్రణయ్‌యాదవ్ ఎంబసీకి వెళ్లి హాజరుకాగా ఆయనను ఏడు ప్రశ్నలు అడిగాడు. అందుకు సమాధానం చెప్పలేకపోవడంతో వీసా రిజక్ట్ అయ్యింది. తనను వీసా పేరుతో మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏప్రిల్‌లోగా సుంకిశాల పనులు పూర్తి

- పనులు వేగవంతం చేయాలని నిర్మాణ సంస్థకు ఆదేశాలు
- ప్రాజెక్టు పనులను పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: మహానగరానికి కృష్ణాజలాల తరలింపుకోసం చేపట్టిన సుంకిశాల ఇంటేక్ వెల్ పనులను ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రాజెక్టు నిర్మాణ సంస్థ సీఈఓ, డైరెక్టర్, హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్లు, టీసీఎస్, గేట్ల ఎక్స్‌పర్ట్, తదితరులతో కలిసి సుంకిశాల ప్రాజెక్టు పనులను పరిశీలించారు. తొలుత ఉన్నతాధికారులతో కలిసి పైప్‌లైను విస్తరణ పనులను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు మిగిలిపోయిన పైప్ లైన్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. వర్షాకాలం సమీపించినందున పైప్ లైన్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్మాణ సంస్థ సీఈఓ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నిపుణులతో కలిసి సుంకిశాల పునర్నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రీడిజైనింగ్ సంబంధించిన వివరాలపై చర్చించారు. శిథిలాల తొలగింపు అనంతరం సివిల్ వర్క్, కంట్రోల్ రూం పనులను వేగంగా ముగిస్తే సైడ్ వాల్ పునర్నిర్మాణానికి మార్గం సులువవుతుందని అంచనా వేశారు. అనంతరం నాగార్జున సాగర్ జలాశయం వైపు ఉన్న టన్నెలింగ్ పనులను పరిశీలించారు. టన్నెలింగ్ వద్ద గేట్ల నిర్మాణం, డిజైన్లపై నిపుణుడు కన్నయ్య నాయుడుతో చర్చించారు.

15 రోజుల్లో పునర్‌నిర్మాణ డిజైన్ ఫైనల్

సుంకిశాల ఇంటేక్ వెల్ రిటైనింగ్ వాల్ శిథిలాలను తొలగింపు పూర్తిచేసి పునర్‌నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు డిజైన్‌లు, డ్రాయింగ్ లను 15 రోజుల్లో ఫైనలైజ్ చేయాలని ఎండీ ఆదేశించారు. పునర్‌నిర్మాణ పనులు చేపట్టి ప్రాజెక్టును త్వరిత గతిన పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులను సూచించారు. ఇంటేక్ వెల్ ప్రాజెక్టు పైప్‌లైన్ పనులు నాలుగు కిలోమీటర్లు మినహా పూర్తి చేశామన్నారు. ఎలక్ట్రిక్ పనులు సైతం చివరి దశకు చేరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, సీజీఎం మహేష్ కుమార్, హైదరాబాద్ ఐఐటి ప్రొఫెసర్లు శశిధర్, సురేంద్రనాథ్, గేట్ల రూపకర్త కన్నయ్య నాయుడు, టీసీఈ ప్రతినిధి నితీష్, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఉన్నారు.


జేపీజీసుంకిశాల ఇంటేక్ వెల్ పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

ప్రమాదవశాత్తు వాహనం పైనుంచి పడి మృతి

కేశంపేట: బతుకుదెరువు కోసం మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం రేవ జిల్లా మజిబోగకు చెందిన సంతోష్ కుమార్ సాకేత్ (35) కుటుంబ సభ్యులతో కలిసి మండల కేంద్రంలోని మామిడితోటలో కూలి పనులు చేసేందుకు వచ్చారు. ఇదే తోటలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సందీప్ తన భార్యతో కలిసి కూలి పనులకు వచ్చారు. సోమవారం సంతోష్‌కుమార్, సందీప్ కలిసి మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేటలో సందీప్ బంధువులు ఉంటున్న మామిడితోటకు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై వెళ్లారు. సందీప్ అక్కడే ఉండగా సంతోష్‌కుమార్ తిరిగి వస్తుండగా మార్గమధ్యలో తులవానిగడ్డ వద్ద ప్రమాదవశాత్తు వాహనం పైనుంచి కింద పడి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అతడిని 108 వాహనంలో షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య కుష్బు సాకేత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి కి తీవ్ర గాయాలైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేటలో నివసించే వట్టి పాక అశోక్ కుమార్ మంగళవారం ఉదయం పెద్దఅంబర్‌పేట నుంచి తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో అశోక్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ సిబ్బందిపై దాడి

నిందితులపై కేసు నమోదు

ఉప్పల్: విధి నిర్వహణలో ఉన్న మున్సిపల్ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తులపై ఉప్పల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ పారిశుద్ధ్య సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌లుతో కలిసి మంగళవారం రామిరెడ్డినగర్ కూడలి వద్ద రోడ్డుపై వేసిన చెత్తను శుభ్రం చేస్తున్నారు. అదే సమయంలో అదే ప్రాంతానికి చెందిన మణెమ్మ అనే మహిళ రోడ్డుపై నిర్లక్ష్యంగా చెత్తను పారబోస్తుండటంతో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ రోడ్డుపై చెత్త వేయవద్దని ఇంటికి వచ్చే ఆటోలోనే చెత్త వేయాలని లేని పక్షంలో ఫైన్ విధిస్తామని చెప్పాడు. దీంతో ఆగ్రహానికి లోనైన ఆమె అతడితో వాగ్వాదానికి దిగింది. ఇంట్లో ఉన్న వ్యక్తులను పిలిచి గొడవ పెట్టుకుంది. ఈ లోగా అక్కడికి వచ్చిన పారిశుద్ధ్య సిబ్బంది ఆమెకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినకుండా ఆమె కుటుంబ సభ్యులు మూకుమ్మడిగా పారిశుద్ధ్య కార్మికులు జానకి, లక్ష్మీ, దేవి, సుజాత, జంగమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌పై దాడి చేసి గాయపరిచారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేసులకు భయపడేది లేదు

తాండూరు టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులపై పెట్టే అక్రమ కేసులకు భయపడేది లేదని విద్యార్థి విభాగం నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమయ్యారని సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్వీ నాయకులు దహనం చేశారు. ఈ ఘటనలో పట్టణ పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరైన అనంతరం బీఆర్‌ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు, పట్టణాధ్యక్షుడు సందీప్ రెడ్డి, నాయకులు వినోద్, నర్సింహులు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, బీఆర్‌ఎస్ నాయకులపై కక్షపూరిత కేసులు బనాయించడం సిగ్గుచేటన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎన్ని కేసులనైనా ఎదుర్కొంటామని, సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

బైక్ ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలు


గాయపడ్డ శివరాజ్

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన వివరాలు.. కద్దాల్ గ్రామానికి చెందిన కడారి శివరాజ్(66) మంగళవారం ఉదయం మండల పరిధిలోని కొత్తూర్‌లో బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి తన స్కూటీపై గూడురు వైపు వెళ్తుండగా శ్రీశైలం హైవే కొత్తూర్ గేట్ వద్ద కందుకూరు వైపు నుంచి వేగంగా వచ్చిన పల్సర్ బైక్ ఢీకొట్టింది. దీంతో శివరాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో పోలీసులు, స్థానికులు అతన్ని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పరమేశ్ తెలిపారు.

రైలు ఢీకొని కార్మికుడి మృతి

నందిగామ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన నందిగామ రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన రమేష్(40) కొంత కాలం క్రితం కొత్తూరు మండలం తిమ్మాపూర్‌కు వలస వచ్చి స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం అతని మృత దేహాన్ని నందిగామ మండల పరిధిలోని రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ మాస్టర్ రహమాత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ప్రమాదవశత్తు రైలు ఢీ కొట్టిందా.. లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎం ఢీ : తీవ్ర గాయాలు


బైక్‌ను ఢీకొన్న డీసీఎం

నందిగామ: ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి వచ్చిన డీసీఎం ఢీ కొట్టడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్ర గాయాలకు గురైన ఘటన మండల పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారి (బైపాస్)పై చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం .. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు నందిగామ మండలం బండకుంట తండాకు కొన్నేళ్ల క్రితం వలస వచ్చాడు. స్థానికంగా ఓ జామ తోటలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన బైక్‌పై మంగళవారం షాద్‌నగర్ వైపునకు వెళ్తుండగా ఎంఎస్ఎన్ పరిశ్రమ సమీపంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై నుంచి ఎగిరిపడ్డ వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడడంతో స్థానికులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుమారుడు పరుశురాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాటరీల దొంగ దొరికాడు

కేశంపేట: మండలంలో ఇటీవల చోరీ అయిన బ్యాటరీలను పోలీసులు రికవరీ చేశారు. మండల పరిధిలోని లేమామిడి, కేశంపేట, బైర్కాన్‌పల్లి గ్రామాల్లో ఇటీవల వాహనాల బ్యాటరీలతో పాటు జనరేటర్ బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఇదే విషయమై బాధితుల నుంచి పోలీసులకు నాలుగు ఫిర్యాదులు అందాయి. పోలీసులు బ్యాటరీ దొంగతనాలను ఛేదించేందుకు ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజీలతోపాటు వివిధ కోణాల్లో సమాచారం సేకరించారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని లక్ష్మీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న మేగిశెట్టి నాగేశ్వర్‌రావు బ్యాటరీలను దొంగిలించినట్టు గుర్తించారు. అతడి నుంచి 12 బ్యాటరీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం

నవాబుపేట: ప్రేమ విఫలమైందని మనస్తాపానికి గురైన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టిగిద్ద గ్రామానికి చెందిన బక్కని ఏసు కొడుకు సందీప్(23), వికారాబాద్‌లో ఐటీఐ చదువుతున్నాడు. ఏడాది క్రితం పట్టణానికి చెందిన ఓ యువతితో ఏర్పడిన పరిచయం, ప్రేమగా మారింది. అమ్మాయి తరఫు కుటుంబ సభ్యులు వీరి పెళ్లికి అంగీకరించలేదు. దీంతో మనస్తాపానికి గురైన సందీప్ గత సోమవారం సాయంత్రం తమ పొలంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ అరుణ్ కుమార్ తెలిపారు.